ఇంటి ముంగిటకే వైద్యసేవలు

- పీహెచ్‌సీలు, సీహెచ్‌ఓలు వదిలి గ్రామాల బాట పట్టిన వైద్యులు
- గ్రామ కూడళ్ల వద్ద వైద్య శిబిరాలు
- రాలేనివారి ఇంటివద్దకే వెళ్లి వైద్యం


బాపనంతపురం శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యబృందం

ఆత్మకూరు: రాష్ట్రప్రభుత్వం వైద్యశాఖలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు పరిమితమైన డాక్టర్లను గ్రామాల చెంతకు చేర్చింది. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా ఇళ్ల వద్దకే వైద్యులు చేరుకుని వైద్య సేవలు అందిస్తున్నారు. ఇప్పటికే ఆత్మకూరు, నందికొట్కూరు నియోజకవర్గాల్లోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీల పరిధిలోని పలు గ్రామాల్లో వైద్య బృందం పర్యటించించి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామ కూడళ్ల వద్ద వైద్య శిబిరాలు నిర్వహించడమే కాకుండా రాలేని స్థితిలో ఉన్న రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య సేవలందిస్తున్నారు.

ఇంటింటికి వైద్యం

ఆత్మకూరు పట్టణంలో సీహెచ్‌ఓ-1, పీహెచ్‌సీ -2 కేంద్రాల్లో తొమ్మిది మంది డాక్టర్లు, వెలుగోడులో 11 మంది, నందికొట్కూరులో 11 మంది, పాములపాడులో ఇద్దరు, బండిఆత్మకూరు, మహానంది, శ్రీశైలం మండలాల్లో ఒకరు, .జూపాడుబంగ్లా, పగిడ్యాల, మిడుతూరు మండలాల్లో నలుగురు చొప్పున వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్నారు. వీరు శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో అన్ని పల్లెల్లో ప్రజలకు వైద్య సేవలు అందించనున్నారు. ఇంటింటికీ వెళ్లి ఇళ్లలో నివసిస్తున్న ప్రజలకు ఎలాంటి జబ్బులు ఉన్నాయి. పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తున్నారు. ప్రతివైద్యుడు తనకు కేటాయించి ప్రతి గ్రామానికి నెలలో రెండు సార్లు సందర్శించి వైద్య సేవలందిస్తాడు.

అక్కడికక్కడే వ్యాధి నిర్ధారణ పరీక్షలు

ప్రతి పీహెచ్‌సీకి రెండు 104 వాహనాలను కేటాయించగా వైద్య బృందాలు ఇందులో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. గ్రామాల్లో వైఎస్సార్‌హెల్త్ క్లీనిక్ ద్వారా ప్రజలకు 14 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రధానంగా బీపీ, షుగర్, మలేరియా, డెంగీ, లాంటి విషజ్వరాల పరీక్షలు, గర్భనిర్ధారణ, తాగునీటి పరీక్షలు, క్యాన్సర్ లాంటి వ్యాధులకు సైతం పరీక్షలు చేస్తారు. వైద్యులు రోగాన్ని నిర్ధారించి అవసరం అయిన వైద్యం, ఆపరేషన్ల కోసం జిల్లా కేంద్రాలకు పంపుతారు. ప్రధానంగా మండలంలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌ఓ లకు వెళ్లే నిరుపేదలు, మధ్య తరగతి కుటుంబాలకు ఉన్నచోటుకే వచ్చి డాక్టర్లు పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యయప్రయాసలు తగ్గాయి.

పల్లెలకు వెళ్లడం సంతోషంగా ఉంది



రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటివద్దకే డాక్టర్‌పథకం ఎంతో హుందాగా ఉంది. తాము పల్లెలకు వెళ్లడం చాలా సంతోషాన్ని కలిగిస్తుంది. ఇంటింటికి వెళ్లడంతో గ్రామాల్లో ప్రజలకు సస్సంబంధాలు ఏర్పడమే కాకుండా ఏ ఇళ్లలో ఎలాంటి రోగులు ఉన్నారో తెలుసుకోవడానికి వీలు ఏర్పడింది. అక్కడే వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం వలన ప్రజలు సంతోషపడుతున్నారు.

– పవన్‌కుమార్, బైర్లూటి వైద్యాధికారి

మారు మూల గ్రామాల ప్రాంతాలకు ఎంతో ఉపయోగం



ఆత్మకూరు మండలంలోని మారు మూల గ్రామమైన సిద్ధాపురంలో వైద్య సిబ్బంది వచ్చి పల్లెలు సందర్శించడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రభుత్వ వైద్యశాలలకు దూర ప్రాంతాలకు వెళ్లేందుకు రోగులు వ్యయప్రయాసలకు గురికావాల్సి వచ్చేది. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామాల్లోకి డాక్టర్లు రావడంతో ఎంతో శుభపరిణామం.

–విష్ణువర్ధన్‌రెడ్డి, సిద్ధాపురం

సీఎంకు కృతజ్ఞతలు



రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాలకే వైద్య సిబ్బందిని పంపించడం ఎంతో గొప్ప విషయం. డాక్టర్లు గ్రామాలకు చేరుకుని పరీక్షలు నిర్వహించడం, అక్కడికక్కడే మందులు ఇవ్వడం శుభపరిణామం. చిన్న చిన్న రోగాలైన జలుబు, దగ్గు, జ్వరం లాంటి వ్యాధులకు గ్రామాల్లోని వైద్యాధికారులు పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తున్నారు. ఇలాంటి పథకం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు చెప్తున్నాం.

–దినకర్, కరివేన

మహానంది ఎస్‌ఐగా నాగేంద్ర ప్రసాద్



మహానంది: మహానంది ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న నాగార్జున రెడ్డిని వీఆర్‌కు బదిలీ చేస్తూ ఇటీవల డీఐజీ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన స్థానంలో మద్దికెర పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న జి.నాగేంద్ర ప్రసాద్‌ను నియమించారు. రెండురోజుల్లో ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు.

అవార్డులకు 146 మంది వలంటీర్ల ఎంపిక

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ వలంటీర్లకు అందించనున్న సేవారత్న, సేవామిత్ర అవార్డులకు ఎంపిక ప్రక్రియ పూర్తయినట్లు ఎంపీడీఓ మేరి బుధవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రామాలలో వలంటీర్లకు కేటాయించిన కుటుంబాలకు సేవలందించడంతో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారిని రాష్ట్ర ప్రభుత్వం సత్కరించనుందని వివరించారు. మండలంలో 146 మంది అవార్డులకు ఎంపిక అయ్యారని తెలిపారు. అందులో ఐదుగురు సేవారత్న, 141 మంది సేవామిత్ర అవార్డులకు ఎంపికైయినట్లు జాబితా వచ్చిందని చెప్పారు. వీరిని ఈనెల 14 వతేది అంబేద్కర్ జయంతి సందర్భంగా సత్కరించనున్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

స్వామిఅమ్మవార్లకు మంత్రి ప్రత్యేక పూజలు


ప్రధాన రాజగోపురం వద్ద మంత్రి దంపతులకు స్వాగతం పలుకుతున్న ఆలయాధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ దంపతులు దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు,అర్చకులు ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వీరు స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకున్నారు. తర్వాత స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

ఘనంగా సప్దర్ హష్మి జయంతి

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో సఫ్దర్ హష్మి 69వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా నాట్య మండలి సీనియర్ కళాకారుడు డాలు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వీధి నాటకాన్ని పోరాట స్ఫూర్తిగా, చైతన్య దీప్తిగా మరిచిన అమూల్యమైన దర్శకుడు ప్రజా కళాకారుడని హష్మి అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రణధీర్, కళాకారులు ఏసేపు, శేషు, ప్రభుదాసు, ఏసన్న, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

వనితకు భరోసా 'మహిళా సమ్మాన్'


పాస్‌బుక్కులు చూపుతున్న మహిళలు

నందికొట్కూరు: వనితలకు ఆర్థిక భరోసా కల్పించడానికి మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పట్టణంలోని తపాలా శాఖ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా సమ్మాన్ పథకాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా రాణించేందుకు చిన్న మొత్తాల పొదుపు పథకాన్ని కేంద్రం తెచ్చిందన్నారు. ఈ పథకం మహిళలకు మాత్రమే వర్తిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పోస్టు మాస్టర్ సాయికుమార్, మహేష్, క్రిష్ణగౌడు, ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర రావు, ఐపీఓ రఘు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు మాకినేని


ఆత్మకూరు: మార్క్సిస్ట్ సిద్ధాంత కర్త, స్వాతంత్య్ర సమరయోధుడు మాకినేని బసవపున్నయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రణధీర్, ప్రజా నాట్య మండలి నాయకులు చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్‌హాల్‌లో బుధవారం మాకినేని వర్ధంతి సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నరసింహానాయక్, స్వాములు, రామ్‌నాయక్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దేవదాయశాఖ కమిషనర్‌ను కలిసిన మహానంది ఈఓ


కమిషనర్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఈఓ, పండితులు

మహానంది: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణను మహానంది ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి, వేద పండితులు రవిశంకర్ అవధాని బుధవారం విజయవాడలో కలిశారు. ఆయనకు శ్రీ కామేశ్వరిదేవి సహిత మహానందీశ్వర స్వామి వారి ప్రసాదాలు, జ్ఞాపిక అందించి వేదాశీర్వచనం చేశారు. మహానంది ఆలయ అభివృద్ధిపై చర్చించారు.

అక్రమ మద్యం ధ్వంసం


మద్యం ధ్వంసం చేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: దాడులు చేసి పట్టుకున్న నాటు సారా, తెలంగాణ మద్యంను బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ధ్వంసం చేశారు. దీని విలువ రూ.95వేలు ఉంటుందని టౌన్ ఎస్‌ఐ ఎన్వీ రమణ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి మద్యం తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్న మద్యం, పట్టణంలో తయారు చేసి విక్రయిస్తున్న నాటు సారా ధ్వంసం చేసినట్లు వెల్లడించారు.

విద్యా కానుక కిట్ల నిల్వకు ఏర్పాట్లు చేసుకోండి


విద్యా కానుక కమిటీ సభ్యులతో సమావేశమైన రాష్ట్ర పరిశీలకులు పి. శ్రీనివాసరావు

పగిడ్యాల: రాబోయే విద్యా సంవత్సరానికి సంబంధించి జగనన్న విద్యా కానుక కిట్లను నిల్వ ఉంచేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసుకోవాలని జగనన్న విద్యా కానుక రాష్ట్ర పరిశీలకులు పి. శ్రీనివాసరావు కమిటీ సభ్యులకు సూచించారు. బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో కేటాయించిన స్టోర్ రూమ్‌లను పరిశీలించి, అదనంగా మరో రెండు గదులు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బూట్లు, యూనిఫాం దుస్తులు, బ్యాగ్‌లు తదితర వస్తువులన్నిటినీ తడవకుండా ఉండే ప్రదేశంలో జాగ్రత్తగా నిల్వ చేయాలని చెప్పారు. వర్షం కురిసినా శ్లాబ్‌లు కారని రూమ్‌లను ఎంపిక చేసి కిట్లను భద్రపరచాలని ఆదేశించారు. పాఠశాలలు పునఃప్రారంభం కాగానే క్లష్టర్‌ల వారీగా జగనన్న కిట్లు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుజనకుమారి, ఎంఈఓ సుభాన్,ఏపీఎం శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

పెరిగిన రంగనాథ స్వామి హుండీ ఆదాయం


హుండీలలోని నగదును లెక్కిస్తున్న భక్తులు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీ లక్ష్మీ రంగనాథస్వామి బ్రహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీలలోని నగదును లెక్కించగా గతేడాది కంటే రూ. 1,41,611ల ఆదాయం పెరిగినట్లు ఆలయ ఈఓ వెంకటరమణ తెలిపారు. బుధవారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, భక్తుల సహకారంతో హుండీలలోని నగదు లెక్కించారు. ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగిన లెక్కింపు కొనసాగగా రూ. 12,74,578ల నగదు వచ్చినట్లు తెలిపారు. అలాగే టికెట్ల విక్రయం ద్వారా రూ. 3,80,000 ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.ఎం.నాగిరెడ్డి, నానిరెడ్డి, సుంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారిణి విజయకుమారి

పగిడ్యాల: రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయాలతో మండల వ్యాప్తంగా చేపట్టిన నాడు- నేడు పనులు, జగనన్న లే అవుట్ కాలనీలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై మండల ప్రత్యేక అధికారిణి, జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసర్ విజయ కుమారి పరిశీలన చేశారు. బుధవారం మండలంలోని నెహ్రూనగర్, లక్ష్మాపురం, పడమర ప్రాతకోట గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. మొదటి విడుత నాడు- నేడు పనుల కింద పూర్తి చేసిన పడమర ప్రాతకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉండడంపై స్కావేంజర్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అరగంటలోగా టాయిలెట్లు పరిశుభ్రంగా ఉంచకపోతే చర్యలు తప్పవని హెచ్చరించి శుభ్రం చేయించారు. అలాగే మధ్యాహ్నం భోజనం పరిశీలించి మెనూ ప్రకారం విజటబుల్ రైస్ చేయాల్సి ఉన్నప్పటికీ కూరగాయాలు లేకుండా అన్నం వండడంపై మండిపడ్డారు. వంట ఏజెన్సీ మహిళలకు వెంటనే నోటీస్ జారీ చేయాలని ఎంఈఓ సుభాన్‌ను ఆదేశించారు. జగనన్న లే అవుట్ కాలనీల్లో లబ్ధిదారులతో ముఖాముఖి చర్చించి నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకున్నారా లేదా జీయో టాగింగ్‌ను క్రాస్ చెక్ చేయించారు. అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి లబ్ధిదారులు త్వరలో గృహ ప్రవేశాలు చేసేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ ఏఈ జ్యోతిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, పంచాయతీరాజ్ శాఖ మండల ఇంజనీర్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

జగనన్న పాలన స్వర్ణయుగం

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- ఉప్పలదడియా, మాసపేటలో 'గడప గడపకు మనప్రభుత్వం'


ఉప్పలదడియాలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

మిడుతూరు: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన స్వర్ణయుగాన్ని తలపిస్తుందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మండల పరిధిలోని మాసపేట గ్రామసచివాలయ పరిధిలోని ఉప్పలదడియా, మాసపేట గ్రామాలలో బుధవారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం జరిగింది. అదే విధంగా జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల అభిప్రాయాలు తెలుసుకుంటూ ఇంటింటికీ స్టిక్కర్లు అతికించారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి, తహసీల్దార్ సిరాజుద్దీన్, రూరల్ సీఐ సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య, కిసాన్‌సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగాల సిద్దారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరు జనార్దన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సల్కోటి గోవర్ధన్ రెడ్డి, కమతం వీరారెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్న పాలనలో అన్ని వర్గాలకు లబ్ధి

నందికొట్కూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరిందని మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 14, 16 వార్డుల్లో మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమం నిర్వహించారు. నాలుగేళ్ల కాలంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మంచి పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అశోక్, రవూఫ్, చిన్నరాజు, లాలు ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామకృష్ణ, రమేష్, వీఆర్ శ్రీను, సచివాలయ కన్వీనర్లు సులోచనమ్మ, జయ ప్రకాష్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


16వ వార్డులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్టికర్‌కు మొక్కుతున్న వృద్ధురాలు

నమ్మకానికి నిదర్శనం సీఎం వైఎస్ జగన్

వెలుగోడు: అన్ని వర్గాల ప్రజలకూ సమాంతరంగా సంక్షేమం అందిస్తూ, అన్ని వర్గాలనూ సంతృప్తి పరుస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నమ్మకానికి నిదర్శనమని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇలియాస్‌ఖాన్, యూత్ నాయకుడు షంషీర్ అలీ అన్నారు. బుధవారం వెలుగోడు సచివాలయం -2 పరిధిలోని బిలాల్ మసీద్ వీధిలో జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ షంషీర్, నాయకులు జబీబుల్లా, తెలుగు రమణ, ఖాదర్ వలి, అన్సార్ తదితరులు పాల్గొన్నారు

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

ఆత్మకూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేశారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీర్, మార్కెట్‌యార్డ్ ఉపాధ్యక్షుడు ఖయ్యూం, వరాల మాలిక్ అన్నారు. పట్టణంలోని 6 వ వార్డులో బుధవారం నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమం నిర్వహించారు. వడ్ల రామాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మౌలాలి పుల్లారెడ్డి ఆధ్వర్యంలో, పట్టణంలోని 24 వార్డులో కౌన్సిలర్ పాణ్యం పార్వతి, కన్వీనర్ జబివుల్లా, ఇస్మాయిల్ ,షంషూర్‌లు ఇంటింట జగనన్న నువ్వే మా నమ్మకం కార్యక్రమం నిర్వహించారు.

'జగనన్నే మా భవిష్యత్'కు విశేష స్పందన

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, పగిడ్యాల, సంకిరేణిపల్లె, లక్ష్మాపురం ,పడమర ప్రాతకోట తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. రెండో రోజైన బుధవారం గృహ సారథులు బ్యాగులు ధరించి ఇంటింటిని దర్శిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన పట్ల ప్రజా స్పందనను తెలుసుకున్నారు. ఇంటింటికి జగనన్న స్టిక్కర్‌లను అతికించి మిస్డ్‌కాల్ చేస్తున్నారు.కార్యక్రమంలో జెడ్పీటీసీపుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, వైస్ ఎంపీపీ పల్లె అరుణమ్మ, బోరెల్లి శ్యామలమ్మ, ఎంపీటీసీలు కళావతి, చంద్రమోహన్‌నాయుడు, ప్రియాంక, గోపాల్, మిద్దె స్వాములు, కో ఆప్షన్ సభ్యులు అస్లాంబాష, సర్పంచ్‌లు పెరుమాళ్ల శేషన్న, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే గ్రామాల అభివృద్ధి

కొత్తపల్లి: ముఖ్యమంత్రి జగనన్నతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని శాలివాహన కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సుగురు రవణమ్మ, సర్పంచు నక్క విజయ్‌కుమార్‌లు అన్నారు. బుధవారం పెద్దగుమ్మడాపురం గ్రామంలో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ఆదేశాల మేరకు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.సచివాలయ కన్వీనర్లు, గ్రామవలంటీర్లు,గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమపథకాల వివరించారు.ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాలను అడిగితెలుసుకున్నారు. వారి అనుమతితో ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో ఉపసర్పంచు బొల్లు శ్రీనివాసులు యాదవ్, ఆర్‌ఎంపీ రాము, సరోజ, రమణ, రవి తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని 10వ వార్డులో బుధవారం పర్యటిస్తూ సొసైటీ చైర్మన్ చౌడయ్య, కో ఆప్షన్‌సభ్యుడు ముర్తుజావలి ప్రజలను జగనన్న పాలన ఎలా ఉందని అడుగుతూ కార్యక్రమం కొనసాగించారు. ప్రజల నుంచి అపూర్వ స్పందన రావడం తో హుషారుగా ప్రజలను కలుస్తూ ప్రభుత్వ పాలన పై ప్రజలతో మాట్లాడుతూ బుక్‌లెట్‌లో పూరించారు. కుటుంబ సభ్యుల అనుమతితో స్టిక్కర్ గోడకు అంటించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు రాములమ్మ, శ్రీనివాసులు, బానుముక్కలలో వైఎస్సార్‌సీపీ ఎ నాయకులు ఓబన్నగౌడు, ఓబుల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో రూ.39.95 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం

- దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి
- ధర్మకర్తల మండలి సమావేశంలో పలు అజెండాలకు ఆమోదం


ధర్మకర్తల మండలి సమావేశంలో చర్చిస్తున్న చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ, సభ్యులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల క్షేత్ర పరిధిలో శృంగేరీ శంకరమఠం నుంచి కరివేన సత్రం వరకు ఆర్‌సీసీ డ్రైన్ నిర్మాణానికై సుమారు రూ.39.95లక్షల వ్యయంతో ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ పిలుచుటకు ధర్మకర్తల మండలిలో తీర్మానించినట్లు దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి తెలిపారు. బుధవారం శ్రీశైలంలో దేవస్థాన ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. సమావేశంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న, ధర్మకర్తల మండలి సభ్యులు, అన్ని యూనిట్ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో క్షేత్ర అభివృద్ధికి సంబంధించిన పలు నిర్ణయాలు తీసుకున్నారు.

- ఆలయ ప్రాంగాణంలోని నవబ్రహ్మ ఆలయాలు, కుమారస్వామి ఆలయం తదితర పరివార ఆలయాలకు రూ.17.50లక్షల వ్యయంతో ఇత్తడితో తయారు చేసిన గ్రిల్ వాకిళ్లను ఏర్పాటు చేయుటకు అమోదించారు.
- దేవస్థానం వైద్యశాల నందు రూ.7.80లక్షల వ్యయంతో ఎక్స్‌రే గదిని నిర్మించుటకు అమోదం.
- నూతనంగా నిర్మించిన గణేశ్ సదనంలో ప్లాస్టిక్ బకెట్లు, మగ్గలు, చిన్న బకెట్లు, బాత్‌రూమ్ స్టూల్స్ మొదలైన వస్తువులు కొనుగోలు చేయుటకు పిలువబడిన టెండర్ రేట్లకు అమోదం.
- కైలాసకంకణాలు తయారీ నిమిత్తం దేవస్థానంనకు అవసరమైన ఉలన్‌దారపు ఉండలు (నీలం, చందనం రంగు) కొనుగోలుకు సంబంధించి టెండర్ల రేటుకు అంగీకారం.
- దేవస్థానం గో సంరక్షణశాలకు ఒక సంవత్సరం కాలం పాటు (ఏప్రిల్ 2023–మార్చి 2024) వరకు గోవులకు అవసరమైన ఎండువరిగడ్డిని కొనుగోలుకు సంబంధించి టెండర్ ధరలకు అమోదం.
- దేవస్థానం గోసంరక్షణశాలకు రెండు సంవత్సరాల కాలంపాటు (ఏప్రిల్ 2023–మార్చి 2025) వరకు గోవులకు అవసరమైన పచ్చిగడ్డిని కొనుగోలుకు సంబంధించి టెండర్ రేట్లకు అంగీకారు.
- పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని శ్రీశైల క్షేత్రపరిధిలో ప్లాస్టిక్ నిషేధించడంలో భాగంగా ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల స్థానంలో గాజు సీసాల వినియోగించుటకు తీర్మానం.

సమావేశంలో ధర్మకర్తల మండలి సభ్యులు ఎం.విరూపాక్షయ్యస్వామి, జంగం సుజాతమ్మ, జి.నరశింహారెడ్డి, ఎం.విజయలక్ష్మి, బి.రామేశ్వరి, అంబాల లక్ష్మీసావిత్రమ్మ, ఏ.మురళి, మేరాజోత్ హనుమంత్‌నాయక్, ఓ.మధుసూదన్‌రెడ్డి, సూరిశెట్టి మాధవీలత, ప్రత్యేక ఆహ్వానితులు తన్నీరు ధర్మరాజు, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, ఎక్స్ అఫీషియో సభ్యులు హెచ్.వీరయ్యస్వామి, ఆలయ అన్ని యూనిట్ విభాగ అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎక్స్ అఫీషియో సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న స్వామివారి ఆలయ ప్రధానార్చకులు

ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ప్రమాణస్వీకారం

గతంలో ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్న మల్లికార్జున స్వామివారి ఆలయ ప్రధానార్చకులు ఇటీవల కాలంలో మృతిచెందడంతో ఆయన స్థానంలో ఆలయ ప్రధానార్చకులుగా విధులు నిర్వహిస్తున్న హెచ్.వీరయ్యస్వామి ధర్మకర్తల మండలి సమావేశ ప్రారంభంలో పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. దేవస్థాన ఈఓ స్వామివారి ఆలయ ప్రధాన అర్చకులచే ప్రమాణ స్వీకారం చేయించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీశైలంప్రాజెక్ట్: ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో ఏపీ సచివాలయ అసోసియేషన్ అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డిని కలిసి వినతిపత్రం అలందించారు. జీఓ నెంబర్ 686 ప్రకారం సిబ్బందికి జీతాలు అందడం లేదని, 104 లో పనిచేస్తున్న సిబ్బందికి కాంట్రాక్ట్ ఉద్యోగులతో సమానంగా ఇవ్వడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయండి

ఆత్మకూరు: ఉమ్మడి కర్నూలు జిల్లాలో అంబేద్కర్ జయంతి వారోత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు శీలం శేషు, జవహర్‌నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జయంతి వారోత్సవాలలో భాగంగా రాజ్యాంగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అలాగే రక్తదాన శిబిరాలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.